# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 92 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

03-02-2026 మంగళవారం వెల : 1 /- పేజీలు : 4




# పలాసలో తప్ప ప్రతిపక్షం ఎక్కడ?

- కూటమి నాయకుల ఇసుక దోపిడీపై మాటెత్తని వైసీపీ!
- రాత్రి-పగలు ప్రోక్లైన్లతో నదుల కొల్లగొడుతున్న వైనం
- నియోజకవర్గాల్లో ధర్నాలే కాదు... ప్రశ్నలే లేవు
- పలాసలో ప్రజల పక్షాన నిలుస్తున్న ప్రతిపక్ష స్వరం

(నవతరం ప్రతినిధి శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా రాజకీయాల్లో నిజంగా ప్రతిపక్షం ఉందా? అనే అనుమానం ఇప్పుడు ప్రజల్లో బలంగా కలుగుతోంది. పలాస నియోజకవర్గం మినహా జిల్లాలోని మిగతా అన్ని నియోజకవర్గాల్లో ప్రతిపక్షం పూర్తిగా కనుమరుగైన పరిస్థితి నెలకొంది.
శ్రీకాకుళం, ఎచ్చెర్ల, నరసన్నపేట, పాతపట్నం, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు రాత్రి-పగలు ప్రోక్లైన్లతో యథేచ్ఛగా జరుగుతున్నప్పటికీ, ప్రతిపక్షం నుంచి ఒక్క ధర్నా లేదు... ఒక్క రోడ్‌రోకో లేదు... కనీసం గట్టిగా ప్రశ్నించే ప్రయత్నం కూడా కనిపించడం లేదు.
'రెడ్ బుక్ రాజ్యాంగానికి భయపడుతున్నారా?' అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. గతంలో ఇసుక తవ్వకాలపై చిన్న అనుమానం వచ్చినా ప్రతిపక్ష నేతలు నదీ తీరాలకు చేరుకుని ధర్నాలు, నిరసనలు నిర్వహించేవారు. కానీ ఇప్పుడు నదులు తవ్వేస్తున్నా, గట్లు కూలుతున్నా, గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నా-ప్రతిపక్షం మాత్రం 'నిమ్మకు నీళ్లు ఎత్తినట్టు' నిశ్శబ్దంగా ఉండటం అనేక సందేహాలకు తావిస్తోంది.

### లోపకారి ఒప్పందాలా? రాజకీయ మౌనమా?

అధికారపక్షం చేస్తున్న ఇసుక దోపిడీపై ప్రతిపక్షం స్పందించకపోవడం వెనుక లోపకారి ఒప్పందాలున్నాయా? సామాజిక వర్గాల సమీకరణే ఈ మౌనానికి కారణమా? రాష్ట్ర, కేంద్ర మంత్రులు ఈ జిల్లావారే కావడం వల్లే విమర్శలేని పరిస్థితి ఏర్పడిందా? అనే ప్రశ్నలు ప్రజల్లో బలంగా వినిపిస్తున్నాయి.
మెడికల్ కాలేజీల అంశం, తిరుపతి లడ్డు వివాదం వంటి రాష్ట్రస్థాయి ఇష్యూలపై మాత్రమే మీడియా ముందుకు వచ్చి మాట్లాడుతున్నప్పటికీ, నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న భూకబ్జాలు, ప్రభుత్వ భూముల దోపిడీ, ఇసుక అక్రమాలపై మాత్రం వైసీపీ నేతలు పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### పలాసలో గట్టిగా కనిపిస్తున్న ప్రతిపక్షం

ఈ పరిస్థితుల్లో పలాస నియోజకవర్గంలో మాత్రం భిన్నమైన దృశ్యం కనిపిస్తోంది. అవినీతి అన్న మాట వినిపించగానే ప్రజల మధ్యకు వచ్చి, అధికారపక్షాన్ని నిలదీస్తూ, ప్రజల పక్షాన బలంగా నిలుస్తున్న నాయకుడిగా మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మాత్రమే జిల్లాలో స్పష్టంగా కనిపిస్తున్నారని అక్కడి ప్రజలు భావిస్తున్నారు. "మిగతా నియోజకవర్గాల ఇన్‌చార్జీలకు తాము ప్రతిపక్ష నాయకులమన్న విషయం కూడా గుర్తుకు రావడం లేదేమో" అన్న భావన జిల్లావ్యాప్తంగా వ్యక్తమవుతోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. నాయకులే భయపడితే? లోపకారి ఒప్పందాలతో నోరు మూసుకుంటే? ప్రజలు తిరుగుబాటు ఎలా చేస్తారు? ప్రతిపక్షాన్ని వెంట తీసుకుని ఎలా నడుస్తారు? అనే ప్రశ్నలు సహజంగానే ఉత్పన్నమవుతున్నాయి.
శ్రీకాకుళం జిల్లా ఇష్యూ ఇప్పుడు ఒక నియోజకవర్గ సమస్య మాత్రమే కాదు... రాష్ట్ర రాజకీయాల్లో ప్రతిపక్ష విశ్వసనీయతకు పరీక్షగా మారింది.

# ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట



నవతరం -శ్రీకాకుళం/ టెక్కలి

- శ్రీకాకుళం, టెక్కలిలో గ్రీవెన్స్ నిర్వహణ
- టెక్కలిలో స్వయంగా అర్జీలు స్వీకరించిన కలెక్టర్
- మొత్తంగా 182 వినతుల నమోదు

ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, గడువులోగా పరిష్కరించడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాలో రెండు చోట్ల ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈసారి కలెక్టర్ స్వయంగా టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్ పేరిట నిర్వహించిన గ్రీవెన్స్‌లో పాల్గొని బాధితుల నుంచి వినతులను స్వీకరించారు. వినూత్నంగా క్షేత్రస్థాయి అధికారులతో కలిసి సమస్యల తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల సేకరణ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ శాఖ, పంచాయతీ రాజ్ విభాగాల సమన్వయంతో వినతులు స్వీకరించారు. డీఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య డి ఎస్ ఓ సూర్య ప్రకాశ్ లు అర్జీదారులతో నేరుగా

-మిగతా 3లో

# ప్రశ్నించిన వారిపై కేసులు

### మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



నవతరం -శ్రీకాకుళం

ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోవడంతోనే రివర్స్ రాజకీయాలకు కూటమి పార్టీ నేతలు పాల్పడుతున్నారని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆరోపించారు.
ఈ మేరకు సోమవారం నగరంలోని స్థానిక ప్రవైట్ పంక్షన్‌హాల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వైసీపీ నేతలను టార్గెట్ చేస్తూ అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని, దాడులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నించిన వారిపై కేసులను బనాయిస్తున్నారని, అన్ని వేళలా ఇలాంటి కార్యక్రమాలు సాగవన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చలేకపోతున్నారని, చంద్రబాబు నాయుడు పాలన సరిగా లేదని ఆరోపించారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు , జోగి రమేష్‌ల ఇంటిపై దాడులకు పాల్పడం సిగ్గు చేటన్నారు. కూటమి సర్కార్ వచ్చాక రాజ్యాంగం అమలవుతుందా అన్న పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు ఆగాయని, రెడ్ బుక్ రాజ్యాంగం మాత్రం అమలవుతుందోని ఎద్దేవా చేశారు. ఇష్టారాజ్యం గా ప్రభుత్వ భూములను నచ్చిన వారికి ధారాదత్తం చేస్తున్నారని, రాజకీయాలు కోసం తిరుమల లడ్డుపై దుష్ప్రచారాలు చేస్తున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. భక్తుల మనో భావాలను దెబ్బతీయాలనుకోవడం తప్పు అని హితవు పలికారు. రాష్ట్రంలో కూటమినాయకులు ఆటవిక పాలన సాగిస్తున్నారని, ఈ విషయంలో గవర్నర్ జోక్యం చేసుకొని సరిదిద్దాలని కోరారు. సమావేశంలో వైకపా నాయకులు దుంపల లక్ష్మణరావు, చిరంజీవి నాగ్, ఎన్ని ధనుంజయ్, పిన్నింటి సాయిరాం, తదితరులు ఉన్నారు.

# వైకాపా బూతులు బ్యాచ్‌కు చట్టమే బుద్ధి చెపుతుంది



టీడీపీ శ్రీకాకుళం పార్లమెంట్ అధికార ప్రతినిధి పి ఎం జె బాబు

నవతరం -శ్రీకాకుళం

వైకాపాలోని కొంత మంది బూతులు బ్యాచ్ నోటి దురుసును వ్యక్తపరుస్తున్నారు. సీనియర్ నాయకులు అయివుండి, చిన్న పెద్ద తారతమ్యం లేకుండా నోటికి వచ్చిన బూతులు చూసి రాష్ట్ర ప్రజలు అందరూ చీత్కరించుకుంటున్నారు. ఆ పార్టీ అధి నాయకుని మెప్పుకోసమే ఇటువంటి కావ్వింపు చర్యలకు పూనుకొన్నట్లు బహిర్గతం అవుతుంది. తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు ను గాని, జాతీయ ప్రధాన కార్యదర్శి

-మిగతా 3లో

ఎడిటోరియల్

# ఇరాన్‌పై మరింత కేంద్రీకరణ!

ఇరాన్‌పై అమెరికా దాడి ముప్పు కొనసాగుతూనే ఉంది. ప్రపంచం ఊహించని రీతిలో వెనెజులా అధ్యక్షుడు మదురో దంపతులను కిడ్నాప్ చేసి తమ దేశానికి తీసుకుపోయిన ట్రంప్ గూండాగిరి అలాంటిదే మరోచర్య ద్వారా ప్రపంచంలో తమకు ఎదురులేదని చెప్పేందుకు, దేశాల నేతలను భయపెట్టేందుకు పూనుకుంది. ఆ ఊపుతోనే ఇరాన్‌పై కూడా కాలుదువ్వుతున్నది. అయితే ఇరాన్‌కు వెనెజులాకు పోలికే లేదన్నది తెలిసిందే. గతేడాది దాడిలో తన అణుస్థావరాలతో పాటు అగ్రనాయకత్వాన్ని కూడా రక్షించుకున్న ఇరాన్ ఆ తర్వాత మరింత అప్రమత్తమైంది, వెనెజులా పరిణామాల తర్వాత ఇంకా జాగ్రత్త పడుతుందని వేరే చెప్పనవసరం లేదు.
ప్రపంచంలోనే అతిపెద్దదైన అబ్రహాం లింకన్ విమాన వాహక నౌకతో సహా అనేక యుద్ధ నౌకలు, వేలాదిమంది సిబ్బందిని ఇరాన్ సమీపానికి వాషింగ్టన్ తరలిస్తున్నది.
బుధవారం నాడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి బెదిరింపులకు దిగాడు. సమయం మించిపోతున్నది, అణు ఒప్పందం చేసుకోవాలని, లేకపోతే ఫలితం అనుభవించాల్సి వస్తుందన్నాడు.
గతేడాది జరిపిన ఆపరేషన్ మిడ్‌నైట్ హామర్ దాడి కంటే ఈసారి తీవ్రంగా ఉంటుందని, అలాంటి పరిస్థితిని తెచ్చుకోవద్దని పేర్కొన్నాడు.
అయితే దాడుల గురించి తమ నేత మనసులోని మాటను ఇంకా బయటపెట్టలేదని అధ్యక్ష భవనవర్గాలు చెప్పటం ప్రపంచాన్ని తప్పుదారి పట్టించే ఎత్తుగడగా చెబుతున్నారు.
ఇరాన్‌పై మిలిటరీ దాడులకు తాము వ్యతిరేకమని చైనా పేర్కొన్నది. గతేడాది దాడిలో ఇరాన్ అణ్వస్త్రాలకు అవసరమైన యురేనియం శుద్ధి కేంద్రాలను ధ్వంసం చేశామని అమెరికా గొప్పలు చెప్పుకున్నప్పటికీ అలాంటిదేమీ లేదని తర్వాత వెల్లడైన సంగతి తెలిసిందే. చర్చలకు తాము వ్యతిరేకం కాదని అయితే తమ మీద అక్రమంగా దాడికి దిగితే తాము కూడా దెబ్బకు దెబ్బతీసేందుకు తుపాకి ట్రిగ్గర్‌పై వేలుతో సిద్ధంగా ఉన్నట్లు టెహరాన్ ప్రకటించింది. వెనెజులాపై దాడికి ముందుకు కరీబియన్ సముద్ర ప్రాంతంలో పెద్ద ఎత్తున బలగాల సమీకరణ గావించిన సంగతి తెలిసిందే.
అయితే నికొలస్ మదురో ను కిడ్నాప్ చేసినంత సులభంగా ఇరాన్ అగ్రనేత ఖామైనీని పట్టుకోవటం గానీ, ఇరాన్‌పై దాడి చేయటం గానీ అంతతేలిక కాదన్నది స్పష్టం.
అంతర్జాతీయ మధ్యవర్తులతో సంబంధాల్లో ఉన్నాం తప్ప అమెరికాకు తామేమీ చర్చల ప్రతిపాదనలను పంపలేదని, ప్రాధేయపడటం లేదని, గత కొద్దిరోజులుగా అమెరికా ప్రతినిధులతో ఎలాంటి మాటలు లేవని ఇరాన్ ప్రకటించింది. అమెరికా దాడి జరిపితే ప్రతిఘటించేందుకు సిద్ధంగా ఉన్నట్లు, ఎందుకు పెట్టుకున్నాంరా బాబూ అన్నరీతిలో నష్టం కలిగించే రీతిలో ప్రత్యర్ధులను దెబ్బతీస్తామని మిలిటరీ అధికారులు చెప్పారు.
ఈ చర్యలతో పాటు ఇరాన్-గల్ఫ్‌దేశాల మధ్య ఉన్న హోర్ముజ్ జలసంధిలో చమురు రవాణా నౌకలను అడ్డుకుంటామని ఆ ప్రాంతంలోని దేశాలకు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ దళాల అధికారులు స్పష్టం చేశారు. ఇదే జరిగితే మరోసారి చమురు సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతుంది, ఈ నేపథ్యంలోనే ఇరాన్‌పై దాడి అనగానే ప్రపంచంలో అనేక దేశాలలో స్టాక్‌మార్కెట్లు ప్రతికూలంగా స్పందించాయి.
ఇరాన్‌ను రెచ్చగొట్టేందుకు ఐరోపా యూనియన్ నేతలు అమెరికాతో చేతులు కలుపుతున్నారు. మరికొన్ని ఆంక్షలతో పాటు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించే అంశాన్ని పరిశీలించేందుకు గురువారం నాడు భేటీ జరిపారు. గతంలో వ్యతిరేకించిన ఫ్రాన్స్ తన వైఖరి మార్చుకొని మద్దతిస్తున్నట్లు ప్రకటించింది. ఇరాన్ ప్రస్తుతం చాలా బలహీనమైన స్థితిలో ఉందని, ఒప్పందం తమకు ఎంతో మేలు చేస్తుందని అమెరికా చెప్పుకుంటున్నది.
గత కొన్నేళ్లుగా పశ్చిమదేశాలు విధించిన ఆంక్షలతో ఇబ్బందులు పడుతున్నది నిజమే అయినప్పటికీ శరణు వేటడానికి టెహరాన్ సిద్ధంగా లేదు.
ప్రభుత్వం గతం కంటే బలహీనంగా ఉందని, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోవటానికి సిద్ధంగా ఉన్నట్లు, మరోసారి జనం వీధులకు ఎక్కుతారని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పార్లమెంటరీ కమిటీ ముందు చెప్పాడు. దానంతట అదే కూలిపోయేస్థితి ఉందని చెబుతూనే దాడులకు ఎందుకు సన్నద్ధమౌతున్నట్లు? అమెరికా వ్యవహారశైలిని చూసినపుడు నిజంగానే ఒకవేళ అణుఒప్పందానికి ఇరాన్ అంగీకరించినప్పటికీ గతంలో మాదిరి అమెరికా కట్టుబడి ఉంటుందన్న గ్యారంటీ లేదు. మరోసారి ఒప్పందం కుదిరినప్పటికీ ఇరాన్ అంతర్గత వ్యవహారాల్లో వాషింగ్టన్ జోక్యం చేసుకోదన్న నమ్మకం కూడా లేదు. మేకపిల్లను మింగదలచుకున్న తోడేలు ఏదో ఒక సాకుతో అపని చేస్తుంది, అందుకే ఇరాన్ తాడోపేడో తేల్చుకొనేందుకే సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోంది!

# అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో చిన్నారుల కళా నీరాజనం

- లయశ్రీ నృత్య కళ నికేతన్ చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనతో భక్తుల మన్ననలు
- గురు కె. పరిమళ హరిహర్ గారికి స్వామి వారి శేష వస్త్రంతో సత్కారం



**నవతరం-శ్రీకాకుళం**

శ్రీ శ్రీ శ్రీ సూర్యనారాయణస్వామి వారి దేవస్థానం, అరసవల్లి (శ్రీకాకుళం)లో భక్తి, కళ, సంస్కృతుల సమ్మేళనంగా చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ప్రసిద్ధ లయశ్రీ నృత్య కళ నికేతన్ వ్యవస్థాపకులు, గురు శ్రీమతి కె. పరిమళ హరిహర్ గారి శిష్య బృందం అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహించిన 'కళా నీరాజనం' కార్యక్రమంలో పాల్గొని భక్తులను మంత్ర ముగ్ధులను చేశారు.
ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులు శాస్త్రీయ నృత్య శైలిలో మూషిక వాహనము, కాలభైరవ అష్టకం, శ్రీమన్నారాయణ, ముద్దుగారే, గరుడ గమన, తిల్లాన వంటి ఆధ్యాత్మిక భావభరితమైన అంశాలను అద్భుతంగా ప్రదర్శించారు. ప్రతి అంశం కూడా భక్తి రసంతో నిండిపోయి, ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపింది. చిన్న వయసులోనే నృత్యంలో ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థుల క్రమశిక్షణ, అభినయం, తాళలయల సమన్వయం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయానికి వచ్చిన భక్తులు, ప్రేక్షకులు చిన్నారుల ప్రదర్శనను ప్రశంసిస్తూ చప్పట్లతో అభినందనలు తెలిపారు.
కార్యక్రమం అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ ఇప్పిలి శంకరశర్మ గారు గురు శ్రీమతి కె. పరిమళ హరిహర్ గారిని స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సంప్రదాయ కళలను పరిరక్షిస్తూ, చిన్నారుల్లో భక్తి భావనతో పాటు సంస్కృతిపై ప్రేమను పెంపొందిస్తున్న గురువుల సేవ అభినందనీయమని అన్నారు.
ఈ కళా నీరాజనం కార్యక్రమం ద్వారా నృత్యం ఒక సాధనగా భగవంతునికి అర్పించవచ్చని, యువతరం సంప్రదాయ కళల వైపు మరింత ఆకర్షితులవుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.



**నవతరం: పలాస**

# రాష్ట్రంలో జంగిల్ రాజ్ పరిపాలన సాగిస్తున్న చంద్రబాబు...!

- రాష్ట్రపతి పాలన తక్షణం రాష్ట్రంలో విధించాలి..!
- రెడ్ బుక్ రాజ్యాంగం కాదు..!
- అంబేద్కర్ రాజ్యాంగం వచ్చేవరకు పోరాటం చేద్దాం..!
- అంబటి' 'జోగి' నివాసాలపై టిడిపి గూండాలు దాడి హేయం..!
- రావణ కాష్టంగా రాష్ట్రం మారడంతో..!
- పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం లేదు..


తిరుమల లడ్డూ అంశాన్ని డైవర్ట్ చేయడానికే ఈ దాడులుటిడిపి నేతల మాట వినని పోలీసులకు సైతం కేసుల్లో ఇరికించే కుట్రలు కూటమి ప్రభుత్వ నిరంకుశ పాలనపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరపడ్డాయి. పలాసలో అంబేద్కర్ విగ్రహం వద్ద వైయస్సార్సీపీ శ్రేణులతో రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చేపట్టిన నిరసన కార్యక్రమం రాష్ట్రంలో సామాన్యుడి నుంచి రాష్ట్ర మాజీ మంత్రుల వరకు ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని, నిజాలు బయటపడినప్పుడు నియంతలు ఎప్పుడూ హింసికే పాల్పడతారని చెప్పడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని జంగిల్ రాజ్ మార్చారని రాష్ట్ర మాజీ మంత్రి , వైయస్ఆర్సీపీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీ లో స్థానిక బస్టాండ్ వద్ద మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ నివాస గృహాలపై టిడిపి గూండాలు దాడి చేసిన ఘటనకు నిరసనగా వైఎస్ఆర్సిపి పలాస నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు నేతృత్వంలో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అక్కడ వైసీపీ శ్రేణులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పలరాజు మాట్లాడుతూ,గడిచిన 20 నెలలుగా రాష్ట్రంలో రాక్షస రాజ్యం, అరాచక పాలన రోజురోజుకు పెరిగిపోతుందన్నారు. ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ నివాసాలపై టిడిపి గూండాలు దాడి చేసిన తీరు ప్రపంచమంతా చూసిందన్నారు. ఏకంగా మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటికి నిప్పు పెట్టి విధ్వంసం సృష్టిస్తే, అంబటి రాంబాబు పై హత్యాయత్నం చేశారని ఆయన ఆరోపణలు చేశారు. ఈ సంఘటనలకు ముందు మాజీ మంత్రి విడదల రజనీపై, మాజీ శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి పై, మరికొందరు వైసిపి నాయకులు , కార్యకర్తలపై తెలుగుదేశం పార్టీకి చెందిన గూండాలు దాడి చేశారన్నారు. వారి అరాచకాలు దుర్మార్గం అన్నారు. రాష్ట్రాన్ని రావణ కాష్టంగా చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం శతవిధాల ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలో రాజకీయంగా వైఎస్సార్సీపీని ఎదుర్కోలేక , ప్రజలకు మంచి పాలన అందించడం చేతకాక ఈ దురాగతాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇది జంగిల్ రాజ్ గా పిలవబడే బీహార్ లో కూడా ఇలా అమానుషమైన దాడులు నివాసాల మీద, కార్యాలయాల మీద జరగవన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న చంద్రబాబు రాజకీయ కుట్ర కోసం ఇంతగా దిగజాడడం సిగ్గుచేటునన్నారు. డైవర్షన్ రాజకీయాలు చేయడంలో చంద్రబాబు దిట్ట అని డాక్టర్ అప్పలరాజు విమర్శించారు. వైయస్సార్సీపీ నేతలు, కార్యకర్తలపై రాష్ట్రవ్యాప్తంగా దాడులకు తెగబడాలని కూటమి ప్రభుత్వ పార్టీ కార్యకర్తలు, గూండాలను ఆ రంగంలోకి దించిందని, వారు కర్రలు, రాళ్లు, ఇతర మారణాయుధాలు పట్టుకొని మరీ కనిపించిన వారిపై విచక్షణ రహితంగా దాడులతో విరుచుకు పడుతున్నారన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో విద్య, వైద్యం, వ్యవసాయం అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగితే.. చంద్రబాబు పాలనలో అరాచకాలు, ఆక్రమణలు, అత్యాచారాలతో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. నాలుగు సార్లు సీఎంగా చేసిన చంద్రబాబు రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని ధ్వజమెత్తారు. పైపెచ్చు రూ. 5కు టీ కూడా రాని ఈ రోజుల్లో 99 పైసలకే ఎకరం భూమిని రియల్ ఎస్టేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, రాష్ట్రంలో అరాచక పరిస్థితులు, రెడ్ బుక్ రాజ్యాంగం అమలు కావడంతో పారిశ్రామికవేత్తలు మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎవరు ముందుకు రాక ఇతర రాష్ట్రాలకు వెళ్ళి పోతున్నారన్నారు. శాంతి భద్రతలు పరిరక్షించవలసిన పోలీసు ఉన్నతాధికారులు సైతం రెడ్ బుక్ రాజ్యాంగంప్రకారం నడుచుకోవాలంటూ.. లేకపోతే వాళ్లపై కూడా చర్యలు తప్పవంటూ కూటమి ప్రభుత్వ పాలకులు బెదిరించడంతో.. పోలీసులు ప్రేక్షకు పాత్ర వహించడం పరిపాటిగా మారిందన్నారు. రాష్ట్రంలో అంబేద్కర్ వ్రాసిన రాజ్యాంగం ప్రకారం పరిపాలన సాగడం లేదని, రెడ్ బుక్ రాజ్యాంగం వల్ల ప్రజల ప్రాణాలకు రక్షణ కరువైన నేపథ్యంలో, రాష్ట్ర గవర్నర్ జోక్యం చేసుకొని తక్షణం రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డాక్టర్ అప్పలరాజు డిమాండ్ చేశారు. రాబోవు రోజుల్లో ఈ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని, మళ్లీ ముఖ్యమంత్రిగా వైయస్ జగన్ అన్నను చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగాఉన్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పచ్చ మూకల విధ్వంసం కొనసాగిస్తున్న తీరుపై వైఎస్ఆర్సిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో త్వరలో రాష్ట్రపతిని కలుస్తామని ఆయన చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను వివరించి రాష్ట్రపతి పాలన పెట్టాలని గవర్నర్కు కోరుతామని డాక్టర్ అప్పలరాజు స్పష్టం చేశారు. ఇప్పటికైనా పోలీస్ యంత్రాంగం, కేంద్ర హోం శాఖ చొరవ తీసుకొని రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి పలాస పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి, పలాస ఎంపీపీ ప్రతినిధి ఉంగసాయి కృష్ణ యాదవ్, వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బండి దుర్యోధనరావు, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య యాదవ్, వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షులు పైల చిట్టిబాబు, జిల్లా కార్యదర్శి దువ్వాడ మధుకేశ్వరరావు, వైఎస్ఆర్సిపి మందస మండల యువజన అధ్యక్షులు సేనాపతి కిషోర్,వైఎస్ఆర్సిపి పలాస రూరల్ అధ్యక్షులు దువ్వాడ రవి, కౌన్సిలర్లు కర్రీ మాధవరావు, గుజ్జు జోగారావు, దున్న నిర్మల సత్యం, వైఎస్ఆర్సిపి నేతలు అందాల శేషగిరి యాదవ్, చింతాడ గణపతి, బాడ జగన్నాయకులు, బత్తిన తేజ, అగ్గున సూర్యారావు,సొర్ర ఢిల్లీ శ్వరరావు, చింతాడ మాధవరావు, పినకాన ముకుంద, మార్పు కృష్ణ, మార్పు వెంకటరమణ, మల్ల సురేష్, వాయులపల్లి శ్రీనివాసరావు, సరస్వతి, మార్పు యుగంధర్, యాళ్ల సంతోష్, రాపాక శేషగిరి, కర్రి గోపాల్, నర్తు వెంకటరమణ యాదవ్, కిర్రి రాజారావు, బగాధి హరికృష్ణ, అంబటి ఆనంద్, మజ్జి హేమరాజ్, నాగేశ్వర్ బృందావన్, తమ్మి నాన శాంతారామ్, డొక్కరి హరికృష్ణ, దల్లి జానకి రెడ్డి, ఈరోతు హేమ సుందర్,బిరాటి వల్లభ, కంచరాన చినబాబు తదితరులతోపాటు నియోజకవర్గం నలుమూలల నుంచి వైయస్సార్సీపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.




# బిసివై ఎచ్చర్ల నియోజకవర్గ కన్వీనర్‌గా బొడ్డా కృష్ణారావు

**నవతరం -ఎచ్చెర్ల**

భారత చైతన్య యువజన పార్టీ (బిసివై) శ్రీకాకుళం జిల్లా, ఎచ్చెర్ల నియోజకవర్గ కన్వీనర్‌గా బొడ్డా కృష్ణరావుని నియమించారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో ఆయనకున్న సంబంధాలు, పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధతను గుర్తించిన బిసివై పార్టీ అధినేత శ్రీ బోడె రామచంద్రయాదవ్ ఈ బాధ్యతను అప్పగించారు. ఈ నియామకం పట్ల బొడ్డా కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. తనకు ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధినేత శ్రీ రామచంద్రయాదవ్ గారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానని ఆయన తెలిపారు.



# చెడు అలవాట్లు ఎప్పుడూ ఉన్నాయి...! వాటికి దూరంగా ఎలా ఉండాలనేదే...?

ఓ ముప్పై ఏళ్ల క్రితం(1994ప్రాంతంలో) గంపలగూడెంలోని తోటమూల టీ తాగితేనే పెద్ద నేరంగా చూసేవాళ్ళు.ఓ ఆడ పిల్ల సైకిల్ తొక్కితే వింతగా చూసేవాళ్ళు. వాస్తవానికి అవి నేరాలు కావు. వింతలు అసలే కాదు. కానీ కొంతమంది దొంగ చాటుగా సిగరెట్, బీడీలు తాగేవారు. వాటిని తాగడం స్టైల్ అని సినిమాల్లో చూపించేవారు. అనేకమంది చేసిన పరిశోధనల వల్ల వాటిని తాగితే కాన్సర్ వస్తుందని, ఊపిరి తిత్తులు దెబ్బతింటాయని తెలిసింది. ప్రభుత్వం వీటిని నిషేధించలేదు కానీ, తాగడం అనారోగ్యానికి హానికరం అని ప్రకటనలు ఇస్తుంది. ఒకప్పుడు ఎక్కడ చూసినా సిగరెట్ పీకలే కన్పించేవి. పొగ తాగేవారితో ఇంకో ప్రమాదం కూడా వుంది. వారితో పాటు పీల్చే వారికి కూడా ప్రమాదమే. ఇక మద్యం గురించి చెప్పనవసరం లేదు. సారాపై ప్రభుత్వాలు కొన్ని సార్లు నిషేధం పెట్టాయి. గ్రామాల్లో కొందరు నాటు సారా కాసేవారు. దీనివల్ల కిడ్నీలు, లివర్ దెబ్బతింటాయి. దీని గురించి వచ్చే నష్టాలని పాలక వర్గాలు పెద్దగా ప్రచారం చేయవు.

ఇప్పుడు శీతల పానీయాల వల్ల నష్టాల గురించి ప్రజలకు తెలిసింది. కానీ వీటి అమ్మకాలు బానే జరుగుతున్నాయి. ప్రస్తుతం డ్రగ్స్ గురించి చర్చ జరుగుతుంది.డ్రగ్స్ వల్ల నష్టాలు కూడా చాలా ఉన్నాయి. ప్రభుత్వాలు వీటి మీద సీరియస్ గానే ప్రచారం చేస్తున్నాయి. జన విజ్ఞాన వేదిక వంటి సైన్స్ ప్రచార సంస్థలు మద్యం వల్ల నచ్చే నష్టాల గురించి ఉద్యమ స్థాయిలో ప్రచారం చేశాయి.


యం.రాం ప్రదీప్

కేవలం వీటి మీద నిషేధం విధించడం వల్ల మాత్రమే పెద్దగా ఉపయోగం లేదు. పాలక వర్గాలు మద్యాన్ని ఆదాయ వనరుగా చూడకూడదు. వీటి గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. చెడు, మంచి అలవాట్లు ఎప్పుడూ ఉంటాయి. చెడు అలవాట్లకు దూరంగా ఎలా ఉండాలనేదే పెద్ద సమస్య. కొసమెరుపు ఏమిటంటే నేను ఈ మధ్య ఓ స్నేహితుడిని ఒత్తిడికి గురైనప్పుడు నీవేమి చేస్తావు అని అడిగితే, కొంచం మద్యం తీసుకుంటా అని చెప్పాడు. ఇంకొక మిత్రుడు టూర్స్ కు వెళ్తా అని చెప్పాడు. ఇదే ప్రశ్నను వారు నన్ను అడిగితే పుస్తకం చదువుతా అని చెప్పా.

# నైపుణ్యంతో విజయ రహస్యం

**నవతరం-శ్రీకాకుళం**

పోటీ తత్వంలో వారి నైపుణ్యాన్ని గుర్తించి శిక్షణను ఇచ్చి ఉద్యోగ అవకాశాలు అవకాశం కల్పించిన ఫోకస్ ఫిట్నెస్ కోచింగ్ సెంటర్ నిరుద్యోగులకు మంచి అవకాశం కల్పిస్తుందని రెండో పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఈశ్వరరావు తెలిపారు. ఆర్ట్స్ కళాశాలలో ప్రాంగణంలో ఫోకస్ ఫిట్నెస్ ద్వారా ఎంపికైన ఏడుగురు అభ్యర్థులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద మధ్యతరగతి అభ్యర్థులకు తక్కువ ఫీజుతో శిక్షణ ఇచ్చి వారి భవిష్యత్తుని చూపించే మంచి సంస్థని ఇటువంటి సంస్థల వల్ల రక్షణ రంగంలో ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఇటువంటి శిక్షణలు తీసుకొని ఉద్యోగాలకు ఎంపిక అవడం గొప్ప విషయం అని తెలిపారు. సంస్థ కరెస్పాండెంట్ సిహెచ్ రాజు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ఈ కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నామని ఎంతమంది అభ్యర్థులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు వచ్చే



విధంగా ప్రయత్నం చేస్తున్నామని ఈ ఏడాది ఏడుగురు అభ్యర్థులు ఎంపిక కావడం గొప్ప విషయం అని తెలిపారు తక్కువ ఫీజులతో శిక్షణ ఇస్తున్నామని అన్నారు.

# ప్రశ్నిస్తోంది కాలం... జవాబిచ్చేదెవరు..?

నమ్మించి వంచించి..
బెదిరించి హింసించి..
అక్రమంగా ఆస్తులు ఆర్జించి,
స్విస్ బ్యాంకుల్లో
దోపిడీ సొమ్ము దాచుకునే
ఆ అవినీతి జలగలకు..
కంటినిండా కునుకెక్కడిది..?
కడుపునిండా తిండి ఎక్కడిది..?

నిన్న వాగ్దానాల
వానలో ముంచిన నేతలు,
నేడు ఆకలితో అలమటించే
అనాధలను చూడరేం?
ఓట్ల వేటలో చూపిన ఆ ఆర్తి..
నేడు ఆర్తుల చెంతకు చేరదేం..?

నిదురపోని
చూపులెవరివి? - దేవతలవి
నిప్పులు గక్కే చూపులెవరివి? -
కామ పిశాచులవి...
నిజమైన కాంతి మృగ్యమైన వేళ,
కాలయముడి కరాళ నృత్యం
ఎక్కడిది..?

తాడును చూసి పామనుకునే
పిరికివాడికి విజయమెక్కడిది..?

చిత్తశుద్ధి లేక శివపూజలు చేసే
భక్తుడికి మోక్షమెక్కడిది..?

దుష్టులను కన్న ఆ దౌర్భాగ్యపు
తల్లిదండ్రులకు మనశ్శాంతెక్కడిది..?
పేగు బంధాన్ని తెంచుకుని,
కన్నవారిని కన్నీరు
పెట్టించే ఆ కఠినాత్ములకు..
సంఘంలో గౌరవమెక్కడిది..?
స్వర్గంలో చోటెక్కడిది...?

ప్రశ్నిస్తోంది కాలం...జవాబిచ్చేదెవరు?



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# వైకాపా బూతులు బ్యాచ్‌కు చట్టమే బుద్ధి చెపుతుంది

**మొదటి పేజీ తరువాయి**

రాష్ట్ర మంత్రివర్యులు లోకేష్ బాబు ను గానీ వైకాపా నోటి దురుసు నాయకులు ఎంత దుర్భాసలు ఆడినా, ఎన్ని కవ్వింపు చర్యలకు దిగినా టీడీపీ శ్రేణులు సంయమనం పాటిస్తున్నారు. ఎందుకంటే టీడీపీ ఒక క్రమశిక్షణ కలిగిన పార్టీ. చర్యకు ప్రతిచర్య అనే విధానం టీడీపీ కి లేదు. కానీ చట్టం తన పని తాను చేసుకుపోతుంది. తిరుపతి లడ్డు కల్తీ కుంబకోణం సిట్ బహిర్గతం చేసిన తర్వాత ప్రజల దృష్టిని మల్లించడానికే ఇటువంటి కవ్వింపు చర్యలకు వైకాపా పూనుకొంటుంది అని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారు. హిందువులు పవిత్రంగా భావించే 20 కోట్ల కల్తీ లడ్డులను తయారు చేయించి భక్తులకు పంపిణీ చేయడం దుర్మార్గం, అది ముమ్మాటికీ దేశంలో ఉన్న సుమారు 113 కోట్ల హిందువుల మనోభావాలను కించపరిచే ప్రక్రియ మాత్రమే. ప్రత్యేక విచారణ బృందం వైకాపా ప్రభుత్వ హయాంలో కల్తీ నెయ్యితో తిరుపతి లడ్డులు తయారు చేసారు అని రుజువులు చేసినా సరే సిగ్గులేకుండా వైకాపా నాయకులు కల్తీ జరగలేదు అని బుఖాయించడం సిగ్గుచేటు.. వైకాపా పాలన అంతా అరాచకాలు, అకృత్యాలు, విధ్వంసాలు, వినాశనా లతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన ఘనత వైకాపా ప్రభుత్వానిదే. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చంద్రబాబు పాలనలో కేంద్ర ప్రభుత్వం అండతో రాష్ట్రం సంక్షేమ అభివృద్ధి బాటలో దూసుకుపోవడం చూసి ఓర్వలేక ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తూ పగటి కలలు కంటున్న వైకాపా నాయకులకు సరిఅయిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ నాయకులు తెలుసు కుంటే మంచిది అని, లేకుంటే సరిఅయిన సమయంలో ప్రజలు తగు బుద్ధి చెపుతారని టీడీపీ హెచ్చరిస్తుంది. ఇప్పటికయినా బుద్ధి తెచ్చుకుని నోటిదురుసు తగ్గించుకోవాలని హితవుపలికారు. ఈ సమావేశంలో ఎం ఎస్ ఎం ఇ, డైరెక్టర్ ప్రధాన విజయరాం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట

**మొదటి పేజీ తరువాయి**

మాట్లాడి వారి సమస్యలను నమోదు చేసుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల వరకు రెండు చోట్ల కలిపి మొత్తం 182 అర్జీలు నమోదయ్యాయి.

అత్యధికంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ విభాగంలో 51 వినతులు రాగా, రెవెన్యూ శాఖకు సంబంధించి 31 ఫిర్యాదులు అందాయి. మిగిలిన వాటి వివరాలు ఇలా ఉన్నాయి. పంచాయతీ రాజ్ 21, భూమి రికార్డులు (సర్వే) 10, హౌసింగ్ కార్పొరేషన్ 10, విద్యుత్ శాఖ 7, టిడ్కో 7, వ్యవసాయం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ చెరి 5 దరఖాస్తులు స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొని తమ విభాగానికి సంబంధించిన సమస్యలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. సాధ్యమైనంత త్వరగా వీటికి పరిష్కారం చూపిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

## అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు: కలెక్టర్ హెచ్చరిక


టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతులను స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎంతో ఆశతో, సుదూర ప్రాంతాల నుండి గ్రీవెన్స్‌కు వస్తారని, వారి సమస్యలను పరిష్కరించడంలో అధికారులు ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. అర్జీ ఏ స్థాయిలో పెండింగ్‌లో ఉన్నా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా భూ సమస్యలు, రేషన్ కార్డులు, పింఛన్లకు సంబంధించిన వినతులను క్షేత్రస్థాయిలో విచారించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. నాణ్యమైన పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. ఆర్డీవో కృష్ణమూర్తి, వినతుల కోసం 5 కౌంటర్లు ఏర్పాటు చేయగా డివిజన్ లో 8 మండలాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# మానవ జీవితంలో..... గంగాస్నాన పుణ్యఫలం !

గంగా స్నానం సకల పాపాలను ప్రతికూల కర్మలను తొలగించి ఆధ్యాత్మిక పవిత్రతను మరియు మోక్షాన్ని ప్రసాదిస్తుందని హిందూ ధర్మంలో ప్రగాఢ విశ్వాసం.స్నానం చేయకపోతే ఆధ్యాత్మికమైన పూజలు జపం మొదలైనవి చేసుకోవడానికి వీలు లేదు పోగొట్టుకోవాలి అంటే చేయాలి. ఈ విధంగా స్నానానికి కనబడే ఫలం కనబడని ఫలం, ఉన్నాయి. స్నానం చేస్తే పై శరీరానికి చేస్తే లోపల శుద్ధి కలుగుతుంది వేదములో ఉంది. రూప, తేజస్సు, బలం, సౌచం, ఆయుషు, తపస్సు,ఆరోగ్యం, కోరికలు లేకపోవుట, చెడు స్వప్న దోషం పోవుట, మేధా పెరుగుట అనే పది విధానాలు శాస్త్రాల్లో ఉన్నాయి. ఈ పవిత్ర నది స్నానం వల్ల శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత అశ్వమేధ యాగంతో సమానమైన పుణ్యఫలం లభిస్తుందని మనకు పురాణాలు చెబుతున్నాయి. గంగను స్మరించిన పునర్జన్మ బంధాల నుండి విముక్తి కలిగి మోక్షం లభిస్తుందని గంగా స్నానం వల్ల సకల శుభాలు కలుగుతాయని, కాశీ విశ్వనాథుని దర్శనానికి ముందు గంగా స్నానం ఆత్మను శరీరాన్ని సిద్ధం చేస్తుంది.

హిందువుగా పుట్టినవాడు జీవితంలో ఒక్కసారైనా కాశీక్షేత్రాన్ని సందర్శించాలని మన పెద్దలు చెబుతుంటారు. కాశీ క్షేత్రాన్ని సందర్శించేందుకిప్పుడు రవాణా సౌకర్యం ఉండడంతో సునాయాసంగా వెళ్లి రాగలుగుతున్నాం. ఇంతకీ కాశీ క్షేత్రానికి అంత ప్రసిద్ధి ఎందుకువచ్చిందంటే, గంగమ్మ తల్లి ఉండటం వల్లనేనని తడుముకోకుండా ఎవరైనా సమాధానం చెబుతారు. కాశీకీ, గంగామాతకు ఉన్న అనుబంధం పురాణ ప్రసిద్ధమైనది. భారతీయ పుణ్యక్షేత్రాల జాబితాలో అగ్రస్థానంలో ఉన్న కాశీలో పితృకర్మలు నిర్వహిస్తే మంచిఫలితం ఉంటుందన్నది తరతరాలుగా మన నమ్మకం. కాశీలో ఉన్న అసిఘట్టం, దశాశ్వమేధ, ఆదికేశవ, పంచగంగ, మణికర్ణిక ఘట్టాలు పంచతీర్థ క్షేత్రాలుగా ప్రసిద్ధి చెందాయి. వీటిలో మణికర్ణలో పవిత్ర స్నానం చేస్తే సకల పాపాలు పరిహారమవుతాయని నమ్మకం. కాశీలో తుదిశ్వాస విడిచిన వారు బొందితో కైలాసానికి వెళ్తారన్న నమ్మకం కూడా ఉంది.

కార్తీకంలో కాశీదర్శనం ఎంతో పుణ్యప్రదం. కార్తీకమాసంలో గంగలో స్నానం చేసి విశ్వనాథునికి అభిషేకంచేస్తే మనిషిలో మాటలకు



అందని మార్పు వస్తుందన్నదని కూడా మన వారి నమ్మకం. అన్నింటికీ నమ్మకమే ప్రధానం. విశ్వనాథుని ఆలయం గంగానదికి పశ్చిమాన మణికర్ణికా ఘట్టానికి సమీపంలో ఉంది. సుమారు 16 మీటర్ల ఎత్తున బంగారు గోపురం ఉన్న ఈ ఆలయం మొగలాయిల కాలంలో ముస్లింల దండయాత్రల్లో అనేకసార్లు దాడులకు గురైంది. ఔరంగజేబుకాలంలో ఈ ఆలయంలో సగం పడగొట్టించి జ్ఞానవాపి అనే మసీదులు నిర్మించారు.

అదొక్కటే కాదు, మన రాష్ట్రంలోని చాలా పురాతన దేవాలయాలు మొగలాయిల కాలంలో స్థానభ్రంశం కావడమో, వాటి స్థానే మసీదులు ఆవిర్భవించడమో జరిగినట్టు చారిత్రక ఆధారాలున్నాయి. చరిత్ర ప్రసిద్ధి చెందిన రాజమహేంద్రవరంలో శ్రీవేణుగోపాలస్వామి ఆలయాన్నిందుకు ఉదాహరణగా చెపుతారు.

ఇలాంటివి మనదేశంలో ప్రతిప్రాంతంలో ఉన్నాయి. కాశీక్షేత్ర మహిమ గురించి చెప్పేందుకు వేయినోళ్ళు చాలవు. గంగానదీలో స్నానం చేస్తే దీర్ఘరోగాలు నయమవుతాయి. అలాగే, గంగాజలాలను చిన్న పాత్రలు, రాగి చెంబుల్లో తెచ్చుకోవడం, శుభకార్యల సమయంలో ఆ నీటిని ఇల్లంతా చిలకరించడం మన సంప్రదాయం. గంగకంత పవిత్రత ఉన్నందువల్లే శారీరక దుర్బలురు సైతం గంగా స్నానంచేయాలనీ, కాశీలో తుది శ్వాస విడనాలని కోరుకుంటూ ఉంటారు. పరమేశ్వరుని శిరస్సునుంచి మానవాళిని ఉద్ధరించేందుకే గంగానది భూమి మీదికి దిగి వచ్చిందని పురాణాలు చెబుతున్నాయి. విశాలాక్షీ సమేత కాశీ విశ్వేశ్వరని సందర్శన భాగ్యంతో పుణ్యగతులు పొందాలని కోరుకోనివారెవరు.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

## అంబటి రాంబాబుపై దాడిని
# తీవ్రంగా ఖండిస్తున్నా...

### స్టేట్ సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతి నాయుడు

**నవతరం-శ్రీకాకుళం**

మాజీ మంత్రి అంబటి రాంబాబు పై జరిగిన దాడిని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ స్టేట్ సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతి నాయుడు పత్రిక ప్రకటన లో తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విపక్ష నేతలనే లక్ష్యంగా చేసుకొని దాడులు పెరిగిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.గుంటూరు శివారులోని గోరంట్లలో పోలీసుల సమక్షంలోనే కర్రలు, రాళ్లతో దాడికి పాల్పడటం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు గాలికి వదిలేసి ప్రస్తుతం జంగిల్ రాజ్ పాలన నడుస్తోందని తిరుపతి నాయుడు విమర్శించారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై లేనిపోని అసత్య ఆరోపణలు చేసి, భక్తుల మనోభావాలను దెబ్బతీసిన ప్రభుత్వం ఇప్పుడు నిలదీస్తున్న వైఎస్సార్సీపీ నేతలపై భౌతిక దాడులకు దిగుతోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో



శాంతిభద్రతలను కాపాడటంలో హోం మంత్రి విఫలమయ్యారని విమర్శించారు. దాడికి పాల్పడిన టీడీపీ గూండాలను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అధికారులపై డి ఒ పి టి కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

## భావితరాలకు దర్పణం చారిత్రక రచన
# జస్టిస్ బట్టు దేవానంద్



**నవతరం-రాజాం**

గత చరిత్రను నేడు అక్షరబద్ధం చేస్తే అది భావితరాలకు అద్దంలా పని చేస్తుందని ప్రముఖ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ అన్నారు. విజయనగరం జిల్లా రాజాంలో గల ఎస్సార్ కన్వెన్షన్ హాల్లో లోలుగు సుశీలమ్మ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా గార రంగనాథం రచించిన నగర రాజం రాజాం (రాజం చరిత్ర- సంస్కృతి) అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. గత చరిత్రను నేడు రాయగలిగితే భావితరాలకు అది మార్గదర్శకం అవుతుందని దేవానంద్ అన్నారు. చరిత్ర రచన ఇతర రచనల కంటే చాలా కష్టమైనదని, దానిలో రంగనాథం సఫలీకృతులయ్యారని చెప్పారు. విగ్రహాలను, శాసనాలను, ఆదిమానవుల ఆనవాళ్లను, గతంలో రాసివున్న ప్రఖ్యాత చరిత్ర గ్రంథాలను పరిశీలించి రాశారని వివరించారు. పరిశోధక గ్రంథ స్థాయిని మించి ఈ పుస్తకం తయారు చేయడం రాజాంప్రాంత వాసులకు గర్వకారణం అని అన్నారు. అలాగే సుశీలమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపడుతూ, చరిత్రకు సంబంధించి, సాహిత్యానికి సంబంధించి కూడా మంచి కార్యక్రమాలను చేయడం మూదావహం అని అన్నారు.
అనంతరం రంగనాధాన్ని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఇటీవల సివిల్స్ కి ఎంపికైన వావిలపల్లి భార్గవ్ తో పాటు సుశీలమ్మ ఫౌండేషన్ సంస్థ ఇప్పించిన శిక్షణ ద్వారా ఉద్యోగాలు పొందిన అగ్ని వీరులు ముప్పైమందికి వేదికపై అభినందన సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ స్థాపకుడు లోలుగు మదన్ మోహన్ తో పాటు రాజాం, బొబ్బిలి శాసనసభ్యులు కోండ్రు మురళీమోహన్, బేబీ నాయన, గొంప కృష్ణ, బల్ల విజయకుమార్, జె. గిరీష్, సినీ దర్శకుడు అడ్డాల శ్రీకాంత్, చైతన్య మురళి కృష్ణ, ప్రముఖ వ్యాఖ్యాత సి.వి.ఆర్. శాస్త్రి, వావిలపల్లి జగన్నాథ నాయుడు, డాక్టర్ గార రవి ప్రసాద్, వావిలపల్లి రామ్మూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.ఇదే వేదికపై జస్టిస్ బట్టు దేవానంద్ దంపతులను ఇంటాక్ అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథనాయుడు సన్మానించారు.



## డాక్టర్ బి.ఎస్ రావు మెమోరియల్ జోనల్ స్పోర్ట్స్ మీట్లో
# శ్రీకాకుళం శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు సత్తా

**నవతరం-శ్రీకాకుళం**



డాక్టర్ బి.ఎస్ రావు మెమోరియల్ జోనల్ స్పోర్ట్స్ మీట్లో శ్రీకాకుళం శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు సత్తాచాటి అందరి దృష్టిని ఆకర్షించారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, మణ్యం జిల్లాలకు చెందిన పదకొండు శ్రీ చైతన్య బ్రాంచీల విద్యార్థులతో ఈ క్రీడాపోటీలను చీపురుపల్లిలోని శ్రీ చైతన్య పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం అనగా 30 జనవరి 2026 తేదీన ఘనంగా నిర్వహించారు.
ఈ ఆటల పోటీల్లో శ్రీకాకుళం శ్రీ చైతన్య బ్రాంచ్ వన్ విద్యార్థులు (మహాలక్ష్మి నగర్) కోకో, త్రోబాల్, షార్ట్ పుట్, రన్నింగ్, వాలీబాల్లో జూనియర్స్ అండ్ సీనియర్స్ విభాగాల్లో మొత్తం పదిహేను పథకాలు సాధించి సత్తా చాటారు.
ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో పథకాలు సాధించిన విద్యార్థులకు శ్రీ చైతన్య పాఠశాల ఉత్తరాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఏ.జీ.ఏం ఎం.వీ సురేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం రీజనల్ అధికారి ఎస్.రామినాయుడు , కోఆర్డినేటర్ ఏ.బాలరాజు , ప్రిన్సిపల్ బి. శ్రీనివాసరావు, మరియు ఆర్.రాంప్రసాద్ ,వైస్ ప్రిన్సిపల్ పి.లోకనాథం, ప్రైమరీ కోఆర్డినేటర్ అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని తెలిపారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ కోటేశ్వరరావు , సి అండ్ ఎం బ్యాచ్ ఇన్చార్జ్ రామ్మోహన్, ఐపీఎల్ ఇన్చార్జ్ హరిప్రసాద్ , జనార్ధన్ , సివిల్స్ ఇన్చార్జ్ కె.ఉత్తమ్ , ప్రైమరీ ఇన్చార్జ్ స్వప్న , జోనల్ ఏ.వో శ్రీనివాసరావు, పి.ఇ.టి టీచర్లు , ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొని విజేతలను అభినందించారు.

# సంప్రదాయబద్ధంగా తెరవే కవిసమ్మేళనం

**నవతరం-శ్రీకాకుళం**

స్థానిక నగరంలోని శాంతినికేతన్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో 113 వ నెల నెలవారీ సాహితీ సమ్మేళనం సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకటరమణమూర్తి నిర్వహణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.తెరవే క్రియాశీలక సభ్యులు ఇద్ది పాపయ్య అతిథిగా పాల్గొన్న కవి సమ్మేళనంలో13 మంది కవులు పాల్గొని తమ కవితలు చదివి వినిపించారు. కార్యక్రమంలో ముందుగా ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచారసభ కార్యదర్శి, తెరవే, ఇంటెలెక్చుయల్ ఫోరం వ్యవస్థాపకులు కోనె శ్రీధర్ ను కేంద్ర ఆర్థిక శాఖ హిందీ సలహా మండలి సభ్యునిగా నియమిశీచడం పట్ల సభ్యులు అభినందనలు తెలిపారు.తదుపరి జరిగిన కవిసమ్మేళనంలో కవులు మహాత్మ గాంధీ పై కవితలు చదివి వినిపించారు. కవులు తోట గోపాలరావు, యం.ఉపేంద్రశర్మ,యు.నాగేశ్వరరావు,




ఆర్.వి.రమణమూర్తి, గుడిమెట్ల గోపాలకృష్ణ, ఐ.పాపయ్య, దబ్బీరు గోవిందరావు,కిల్లాన శ్రీనివాస్, వావిలపల్లి రాజారావు, పి.వి.దుర్గాప్రసాద్, కుప్పిలి త్రినాథరావు, టి.విజయ లక్ష్మణ్, కె.బి.రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నిస్సహాయ కుటుంబానికి చేయూత

**నవతరం-శ్రీకాకుళం**

నిస్సహాయ ఉమ్మడి కుటుంబానికి చేయూతనివ్వాలని, ఆపదలో ఉన్న వారికి, మన శక్తికొలది సాయమందించాలని, స్థానిక లెప్పర్సీ కోలనీకి చెందిన చిరుద్యోగి గదిలి.ధనలక్ష్మి కుమారుడు గదిలి.మణికంఠ అన్నారు. అంపోలుకు చెందిన ఉట్ల.హేమంత్ కుమార్ కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించి మాట్లాడుతూ ఉట్ల.హేమంత్ కుమార్ గత కొంత కాలంగా లివర్ కు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న విషయం విదితమేనని, ఉమ్మడి కుటుంబం, అందులోనూ ఇంటికె పరిమితమౌతున్న హేమంత్ నిస్సహాయునిగా ఉండటం బాధాకరమని, ఇంటి బాధ్యతను ఆరోగ్యంగా ఉన్న కాలంలో చూసుకునేవాడని, విధి ఆడిన నాటకంలో గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో వైద్యశాలకు తిరుగుతూ, సంపాదనలేక మనోవేదనకు గురౌతున్నారన్నారు.
వీరి ఉమ్మడి కుటుంబ పరిస్థితిని రెడ్ క్రాస్ ప్రతినిధి నంది.ఉమా శంకర్ ద్వారా తెలుసుకున్నానని, ఇందులో భాగముగానే ఈ రోజు చిరు సహాయాన్నందించానన్నారు. అనంతరం హేమంత్ ఉమ్మడి కుటుంబ సభ్యులు, సహాయం చేసిన వారికి, సహాయ కారకులు నంది ఉమా శంకర్ ఉర్లం.శివతేజ పట్నాయక్ లకు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు,



సేవకులు ఉర్లం. శివతేజ, రెడ్ క్రాస్ ప్రతినిది నంది.ఉమా శంకర్, పెద్దపాడు సేవకులు బొట్టా సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాపులను రాజకీయంగా అణగ దొక్కడమే టీడీపీ లక్ష్యం

### - మాజీ మంత్రి అంబటి పై దాడి గర్హనీయం
### - వైయస్సార్సీపి యువజన సీనియర్ నేత సేనాపతి కిషోర్

**నవతరం-పలాస**

రాష్ట్ర జనాభాలో మెజార్టీ సామాజిక వర్గమైన కాపులను ఒక పథకం ప్రకారం రాజకీయ, సామాజికంగా అణగ తొక్కేందుకు తెలుగుదేశం పార్టీ లక్ష్యంగా పెట్టుకుందని వైఎస్ఆర్సిపి పలాస నియోజకవర్గం సీనియర్ యువజన నాయకుడు, తూర్పు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షులు సేనపతి కిషోర్ ఆరోపించారు. వైఎస్ఆర్సిపి రాష్ట్ర నేత, మాజీమంత్రి అంబటి రాంబాబు తెలుగుదేశం పార్టీ గూండాలు హత్యాయత్నానికి పాల్పడిన తీరుకు నిరసనగా సోమవారం పలాస లో నిర్వహించిన కార్యక్రమం లో పాల్గొన్న వైయస్సార్సీపి యువజన నేత సేనాపతి కిషోర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో 1989 సంవత్సరానికి ముందు కాపులు ఎదుగుతారనే ఉద్దేశంతో తమ నాయకుడు వంగవీటి రంగా ను తెలుగుదేశం పార్టీకి చెందిన పెద్దల కుట్రలతోనే హత్య చేసినట్లుగా ఆరోపణలు లేకపోలేదు అన్నారు. రాష్ట్రంలో మంచి నాయకత్వ లక్షణాలు కలిగిన కాపు సామాజిక వర్గానికి చెందిన నేతలు ఉంటే వారిని ఆ రాజకీయంగా, సామాజికంగా అణిచివేయడం, నోరు కలిగిన వ్యక్తులు ఉంటే వారిని అడ్డు తొలగించుకోవడం తెలుగుదేశం పార్టీలో కొందరు పెద్ద నేతల



ఎజెండాగా మారిందని సేనాపతి కిషోర్ విమర్శించారు. 2014 నుంచి 2019 వరకు కాపు నాయకుడు ముద్రగడ పద్మనాభం పై కూడా అక్రమ కేసులు పెట్టారని ఆయన గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా కాపులను అణగ దొక్కడమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వైయస్సార్సీపి ముఖ్య నాయకుడు అంబటి రాంబాబు కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రతిరోజు మీడియా ద్వారా ప్రజలకు వివరిస్తూ.. విమర్శలు చేస్తుండంతో శనివారం తెలుగుదేశం పార్టీ గూండాలు దాడి చేయడం దుర్మార్గపు చర్యని మండిపడ్డారు. ఆయన మీద దాడి చేసి మట్టు పెట్టాలనే ఉద్దేశంతో దారుణానికి తెగపడ్డారన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**